కథ

# నవ వసంతం

**వాణిశ్రీ**

"నేను ఈ బ్రాంచీకి వచ్చి ఆరునెలలైంది కదూ" అడిగాడు రామమోహన్‌రావు తన ఎదురుగా కూర్చున్న సుమతిని.

"ఔనండీ" అన్నది సుమతి తనకి ఆ విషయం ఎందుకు గుర్తు చేస్తున్నాడని ఆలోచిస్తూ.

"నువ్వు నీ పని సిన్సియర్‌గా చేస్తున్నావు. ఐ లైక్ యూ" అన్నాడు.

"థాంక్యూ సర్" అన్నది.

"కానీ నువ్వు మూడీగా ఉంటున్నావు. సంతోషంగా ఉండడం నేనెప్పుడూ చూడలేదు. ఏదో పోగొట్టుకున్నట్లు ఉంటావు."

"అవునండీ. నేను జీవితంలో అన్నీ పోగొట్టుకున్నాను. సుఖం, సంతోషం అన్నీ పోయాయి. నాకెవ్వరూ లేరు. నా ముసలి తల్లి మాత్రం ఉంది. ఆమెకోసం బ్రతుకుతున్నాను" సుమతి కళ్లల్లో నీళ్లు నిండాయి.

"నీ తల్లి కోసం బతికున్నానంటున్నావు. ఆమె చనిపోతే నువ్వూ చనిపోతావా?"

సుమతి అతనివైపు ఆశ్చర్యంగా చూసింది.

"చూడు సుమతీ! ఎవరి కోసమో నువ్వు బతికున్నావనేది ఒక భ్రమ. నీ జీవితం నీది. నీ సుఖం నీది, నీ దుఃఖం నీది. మరొకరు నీ బదులు అనుభవించరు. నీ గురించి నువ్వు ఆలోచించు. నిన్ను బాధపెట్టిన సంఘటనలు పీడకలగా భావించి మర్చిపో" అన్నాడు రామమోహన్‌రావు.

"అవి నన్ను బాధపెట్టిన సంఘటనలు కావండి. నేను బతికుండీ చచ్చిపోయిన దానిలా మిగిలిపోవడానికి కారణాలు. అదంతా ఈ జన్మలో మర్చిపోలేనండీ" ఆమె ముఖాన్ని రెండు చేతులతో కప్పుకుని దుఃఖించింది.

రామమోహనరావు ఆమెను చూస్తూ అలా ఉండిపోయాడు. అతను ఆరునెలల క్రితం ఈ బ్రాంచి మేనేజర్‌గా చార్జి తీసుకున్నాడు. స్టాఫ్ మొత్తంలో సుమతి సిన్సియర్ వర్కర్‌గా గుర్తించాడు. ఆమె ఏ విషయంలోనైనా నిజాయితీగా ప్రవర్తించడం గమనించాడు. అంతేకాదు, ఆమె అపురూపమైన అందగత్తె. ఆమెలో నైరాశ్యం ఎందుకో అతనికి అర్థం కాలేదు. ఆమె విధవ అని తెలుసుకున్నాడు. ఆమెకు ముప్పై మూడేళ్లు. ఇంకా ఎంతో జీవితం వుంది. తనూ యాక్సిడెంట్‌లో భార్యాపిల్లల్ని పోగొట్టుకుని ఒంటరివాడయ్యాడు. ఇద్దరూ ఒకే పడవలో ప్రయాణం చేస్తున్నారు. ఆమె మీదకు మనసు పోతోంది. ఇద్దరూ ఒకరికొకరు తోడునీడగా ఉంటే అనే ఆలోచన కలిగింది. కానీ ఆమె నుంచి స్పందన కరువైంది. ఆమెకు మళ్లీ పెళ్లి మీద ఆలోచన వున్నట్లు లేదు. ప్రయత్నించి చూద్దాం అనుకుని సుమతిని మాటల్లో పెట్టాడు.

"చూడు సుమతి! నువ్వు చిన్నదానివి. ఎంతో జీవితం ఉంది. నీ తల్లి ఎంతో కాలం నీకు తోడుగా వుండదు. ఆ తరువాత ఒంటరిదానివై పోతావు."

సుమతి తలెత్తి అతనివైపు చూసింది. ఎన్నడూలేనిది ఈ రోజున ఇవన్నీ ఎందుకు చెప్తున్నట్లు? అన్నట్లు ప్రశ్నార్థకంగా ఉన్నాయి ఆమె చూపులు. అది గ్రహించినవాడిలా నవ్వాడు అతను.

"నేను ఇవన్నీ ఎందుకు చెప్తున్నానంటే ఇందులో నా స్వార్థం కూడా ఉంది. నా గురించి నీకు తెలుసు. భార్యాపిల్లల్ని పోగొట్టుకుని మూడేళ్లయింది. ఒంటరితనం ఫీలవుతున్నాను. జీవితం నిస్సారంగా ఉంది. నువ్వు కూడా అలాగే ఫీలవుతూ ఉంటావని అనిపించింది. నీకేం తక్కువ? మనం ఒకరికొకరు తోడుగా జీవితం ఎందుకు గడపకూడదు?" అన్నాడు రామమోహన్‌రావు.

"సారీ అండీ. మీకు నా గురించి పూర్తిగా తెలియదు. నేను అనుభవించిన వైవాహిక జీవితం భర్త చేతిలో పడిన బాధలు నన్ను రాయిలా మార్చివేసాయి" కన్నీళ్లు ఆమె బుగ్గలమీద నుంచి కారుతున్నాయి.

"నేనే సారీ చెప్పాలి సుమతీ. నీకు గతం గుర్తు చేసి బాధ పెట్టాను" నొచ్చుకున్నాడు అతను.

"ఫర్వాలేదండీ. మీరు గుర్తుకు చేయకపోయినా అవి నాకు గుర్తుకు వస్తూనే వుంటాయి. మీ ప్రపోజల్ కాదన్నందుకు మన్నించండి. నాకు మళ్లీ పెళ్లి చేసుకుని పిల్లల్ని కనాలని లేదు. ఎందుకంటే వాళ్లు నా కళ్లముందే తండ్రి దుర్మార్గానికి బలైపోయారు" అని సుమతి జరిగింది చెప్పసాగింది.

"నా భర్త వెంకట్రావు అనుమాన పిశాచి. పెళ్లయిన కొత్తలోనే అతని స్వభావం గ్రహించాను. పోనీ ఉద్యోగం మానేస్తానని కూడా అన్నాను. తన ఒక్కడి జీతంతో సంసారం సాగదని అన్నాడు. ఇద్దరు పిల్లలు పుట్టారు. అతని అనుమానం పెరిగిందేగానీ తగ్గలేదు. పిల్లలకి నా పోలిక రావడం భరించలేకపోయాడు. అతను నల్లగా ఉండేవాడు. నాకు తను భర్తగా తగడని బాధపడుతూ ఉండేవాడు. ఆ మాట రోజూ అనేవాడు. నేను అతనితో తృప్తి పడడంలేదని కూడా అనేవాడు. నేను మీతో చెప్పలేని మాటలు అనేవాడు. పిల్లలు ఎవరికి పుట్టారో చెప్పమనేవాడు. నేను అతని చిత్రహింసలు భరించలేక ఇంట్లో నుంచి వెళ్లిపోయి నా తల్లితోపాటు ఉండసాగాను. ఒకరోజు నేను ఇంట్లో లేనప్పుడు వచ్చి పిల్లలతో ప్రేమగా మాట్లాడి వాళ్లతో గడుపుదామని వచ్చానని, పిల్లలు రోజూ గుర్తుకు వస్తున్నారని మా అమ్మ దగ్గర ఏడ్చాడు. ఆమె అతని నటన పసిగట్టలేకపోయింది. అతను ఐస్‌క్రీమ్ ఇప్పిస్తానని పిల్లల్ని తీసుకువెళ్లాడు. ఇద్దర్నీ చెరువులోకి విసిరేసాడు. ఆ తరువాత అతన్ని పోలీసులు పట్టుకుని జైల్లో పెట్టారు. బంధువులు బెయిల్ ఇప్పిస్తే బైటికొచ్చాడు. పిల్లలు నాకు పుట్టలేదని కోర్టులో అరుస్తూ ఉండేవాడు. ఒక రోజున అతనూ ఆత్మహత్య చేసుకున్నాడు" చెప్పింది సుమతి.

రామమోహనరావు ఆమెవైపు సానుభూతిగా చూసాడు. సుమతి అందం ఆమె పాలిట శాపమైన కథ అతన్ని కదిలించింది. ఆమెపట్ల జాలి కలిగింది. పాపం ఎంత వ్యథ అనుభవించిందో అనుకున్నాడు.

"నాకు జీవితం మీద విరక్తి కలిగింది. నా తల్లి గురించి ఈ జీవితాన్ని భరిస్తున్నాను. మీరన్నట్లు ఆమె పోయిన తరువాత నేను కూడా ఆత్మహత్య చేసుకుంటానేమో" అన్నది కళ్లు తుడుచుకుంటూ.

"సుమతీ! అటువంటి పిచ్చి ఆలోచనలు మానుకో" అని మందలించాడు రామమోహనరావు.

ooo

రామమోహనరావు తనతో పెళ్లి ప్రస్తావన తెచ్చిన తరువాత అతన్ని చూసినప్పుడల్లా అతని మాటలు చెవుల్లో ధ్వనిస్తుండేవి. సుమతి మనసులో ఆలోచనలు మెదలసాగాయి. అతనికేం తక్కువ? అందగాడు, మంచి మనిషి అనుకోసాగింది. అతను కూడా ఆమెతో చనువుగా ఉండడానికి ప్రయత్నించసాగాడు. ఒక్కోసారి ఆమెను కారులో ఇంటివరకు డ్రాప్ చేసేవాడు. ఆమెలో నెమ్మదిగా మార్పు కనిపించడంతో సంతోషించాడు. పెళ్లి విషయం కాకుండా వేరే విషయాలు ప్రస్తావిస్తూ ఆమెతో కాలం గడిపేవాడు.

అతని సలహాతో బొట్టు పెట్టుకోవడం అలవాటు చేసుకుంది. ఆమె మనసు అతనివైపు మొగ్గసాగింది. ఒక రోజున రామమోహనరావు సుమతి ఇంటికి వెళ్లాడు. ఆమె తల్లి పార్వతితో అసలు విషయం చెప్పాడు.

"అమ్మా! నేను సుమతిని పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాను. మీరు మీ అమ్మాయికి నచ్చచెప్పండి. నా గురించి ఆమెకు అన్నీ తెలుసు" అన్నాడు.

"నేను ఆ విషయం గ్రహించాను బాబూ. అమ్మాయికి మళ్లీ పిల్లల్ని కనడం ఇష్టంలేదు. ఎందుకంటే తను అల్లారుముద్దుగా పెంచిన ఇద్దరు పిల్లలు ఒకేసారి చనిపోవడంతో తల్లడిల్లిపోయింది. ఇప్పుడు పిల్లలు పుడితే ప్రతిరోజూ వాళ్లు జ్ఞాపకం వస్తుంటారనీ, అది తను



భరించలేనని అంటుంది" అన్నది పార్వతి.

సుమతి కూడా తల్లి చెప్పింది యదార్ధమేనన్నట్లు తలూపింది. రామమోహనరావుకి అంతా అర్ధమయింది. ఆమె తనక కావాలనుకుంటున్నప్పుడు ఆమె మానసిక పరిస్థితి కూడా గ్రహించాలి అనుకున్నాడు.

ఒకరోజు రామమోహనరావు సుమతి చేతికి ఒక కాగితం అందించాడు.

"ఏమిటి సార్ ఇది?" అన్నది సుమతి అందుకుంటూ.

అది డాక్టర్ సర్టిఫికెట్. రామమోహనరావు వేసెక్టమీ ఆపరేషన్ చేయించుకున్నట్లు డాక్టర్ ఇచ్చిన సర్టిఫికెట్. సుమతి ఆశ్చర్యంతో అతనివైపు చూసింది.

అతను చిరునవ్వు నవ్వాడు. తనకోసం అతను పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించుకున్నాడు. తను కావాలని అతనికి బలమైన కోరిక వుంది. అది ఔదార్యమా? త్యాగమా? ఏదైనా తనకోసం చేసాడు. సుమతి ఎండ తగిలిన మంచుబొమ్మలా కరిగిపోయింది. మోడు వారిన తన జీవితంలో నవ వసంతం తీసుకురావడం కోసం అతను పడిన తాపత్రయం ఆమెకు అమితమైన ఆనందాన్ని కలిగించింది.

రామమోహనరావు సుమతి బుగ్గలమీద చెయ్యివేసి కన్నీరు తుడిచాడు. అతని చేతిని పట్టుకుని ముద్దు పెట్టుకుని పెళ్లికి తన అంగీకారం తెలియజేసింది సుమతి.

○○○

రామమోహనరావుకి సుమతికి పెళ్లయి సంవత్సరం దాటింది. వారి అన్యోన్యమైన దాంపత్య చూసి సుమతి తల్లి పార్వతమ్మ ఆనందానికి హద్దులు లేవు. మొదటి


భర్తతో ఎంత నరకం అనుభవించిందో అంతకు ఎన్నో రెట్లు ఇప్పుడు రామమోహనరావుతో ఆనందం అనుభవిస్తోంది. ఇద్దరూ కారులో ఆఫీసుకు వెళ్లడం, సినిమాలకు, షికార్లకు తిరగడం ఆమెకు చూడముచ్చటగా ఉంది. కానీ ఆ సంతోషం వెనుక దిగులు కూడా ఉంది. వీళ్లకి పిల్లలు కూడా కలిగితే ఎంత బాగుండును అనుకుంటుంది. అది దీపం కింద చీకటిలాంటిది మాత్రమే.

ఒకరోజు సుమతి ఆఫీసులో కళ్లు తిరిగి పడిపోయింది. రామమోహనరావు కంగారుపడి ఆమెను హాస్పిటల్‌కు తీసుకువెళ్లాడు. డాక్టర్ ఆమెను పరీక్షించి అతన్ని పిలిచింది.

"కంగ్రాట్స్ రామమోహనరావుగారూ! సుమతి ప్రెగ్నెంట్" అంది.

## పెళ్లి ఊసు లేదు

*కత్రినా డేటాఫ్ బర్త్ ప్రకారం ఆమె ఈ జూలై 16కి ఇరవై అయిదో ఏట ప్రవేశిస్తోంది. ఇప్పటికే ఆమె సినీ కెరీర్ సక్సెస్ బాటలో పయనిస్తోంది. ఇక ఈ ఏడాది కూడా ఆమె కెరీర్‌కి తిరుగులేదట. అన్నీ విజయవంతమైన సినిమాలే వుంటాయి- అంటున్నాడు భవిక్ సంఘ్వీ అనే న్యూమరాలజిస్టు. అంతే కాదు, సల్మాన్ ఖాన్‌తో ఆమె పెళ్లి కూడా జరిగేట్టు లేదు. ఇద్దరికీ అభిప్రాయ భేదాలు వచ్చే చాన్స్ వుందిట కూడా. అయినా ఇద్దరికీ దాదాపు ఇరవై ఏళ్ల తేడా వుంది కాబట్టి, ఈ పెళ్లి జరగపోవచ్చనే అనుకుంటున్నారు చాలామంది.*



డాక్టర్ ప్రిస్క్రిప్షన్ రాసిచ్చి ఆమెను ఇంటికి పంపింది. సుమతి ముభావంగా ఉంది. ఇంటికి వచ్చాక అతన్ని నిలదీసింది.

"మీరు నన్నెందుకు మోసం చేసారు?"

"సుమతీ! ఏమిటి నువ్వనేది?"

"ఆ రోజు మీరు వేసెక్టమీ ఆపరేషన్ చేయించుకున్నారని సర్టిఫికెట్ చూపించారుగా. అది దొంగ సర్టిఫికెట్ కదూ. నన్ను లొంగదీసుకోవడానికి వేసిన ఎత్తు కదూ" అన్నది.

"ఛ...ఛ... అటువంటిదేంలేదు" అన్నాడు.

"మరి నాకు గర్భం రావడమేమిటి?"

"వేసెక్టమీ ఆపరేషన్ ఫెయిలై ఉండవచ్చు సుమతీ. తొందరపడి నన్ను అపార్థం చేసుకోవద్దు. ఐనా ఇప్పుడేమైందని కంగారుపడుతున్నావు" అంటూ ఆమెను దగ్గరకు తీసుకున్నాడు.

"అది కాదండీ. మీకు తెలుసుగా. నాకు పిల్లల్ని కనడం ఇష్టంలేదు" అన్నది.

అతను ఏమీ మాట్లాడలేదు. పార్వతమ్మ అంతా వింటూనే వుంది. ఆమెకు ఇప్పుడు చాలా ఆనందంగా ఉంది. పిల్లలులేని లోటు తీరబోతోందని ఆమె సంబరపడుతోంది. కానీ సుమతి మొండి మనిషి. అంత తేలిగ్గా సమాధానపడదు. ఆమె కండిషనల్ పెళ్లి చేసుకుంది. అతను వేసెక్టమీ ఆపరేషన్ చేయించుకున్నాకే పెళ్లికి ఒప్పుకుంది. ఇప్పుడిలా జరిగింది.

"అమ్మా! నీకు పిల్లలు లేకుండా ఉంచడం భగవంతునికి ఇష్టం లేదేమో! అందుకే ఇలా జరిగిందేమో? ఆలోచించు. తొందరపడి ఏ నిర్ణయం తీసుకోకు" అన్నది పార్వతమ్మ.

రామమోహనరావు సుమతివైపు ఆశగా చూసాడు. సుమతి తల వంచుకుని ఆలోచిస్తోంది. ఇందులో అతని మోసం ఏమీ లేదేమో! విధి విలాసం అనుకోవాలేమో? ఐనా ఇందులో అంత మోసం ఏముంది? ఆడదాని ప్రేమ కోసం మగాడు ఎన్నో నాటకాలాడతాడు, అబద్ధాలాడతాడు. ఇది కూడా అటువంటిదే కావచ్చు అనుకుంది. ఆమె మనసు తేలికైంది.

మర్నాడు రామమోహనరావు సుమతితో అన్నాడు.

"సుమతీ! నీకు ఇష్టం లేకపోతే అబార్షన్ చేయించుకో"

"నేను ఇష్టంలేదని మీతో అన్నానా?" సీరియస్‌గా అన్నది సుమతి.

"మరి నిన్నటి నుంచి అదోలా వున్నావు. రాత్రి భోజనం కూడా చేయలేదు" అన్నాడు.

"గర్భిణికి ఈ సమయంలో అలాగే వుంటుందిలెండి" అని నవ్వింది.

ఆమె మనసు అతనికి అర్థమయింది. మనసు సంతోషంతో తేలిపోయింది.

"నువ్వు డెలివరీ అయ్యేవరకూ ఆఫీసుకు రావద్దు. నీకు సెలవు మంజూరు చేస్తున్నాను. ఏం?" అన్నాడు నవ్వుతూ.

ఆమె ముసిముసిగా నవ్వింది.

'కాలం గాయాలను మాన్పడం అంటే ఇదే కదా' అనుకున్నాడు రామమోహహనరావు.

ooo

డాక్టర్ ఫైయాజ్ క్లినిక్‌లో కూర్చుని ఉన్నాడు రామమోహనరావు.

"థాంక్స్‌రా డాక్టర్. నువ్విచ్చిన దొంగ సర్టిఫికెట్ నమ్మి నన్ను పెళ్లి చేసుకుంది సుమతి. పాపం తను ఇప్పుడు ప్రెగ్నెంట్" అని నవ్వాడు రామమోహనరావు.

"వారిజాక్షులందు, వైవాహికములందు బొంకవచ్చు అన్నారు. దొంగ సర్టిఫెకెట్లు కూడా ఇవ్వవచ్చు అని అందులో చేరిస్తే సరి" అన్నాడు డాక్టర్ ఫైయాజ్.

స్నేహితులిద్దరూ నవ్వుకున్నారు.

"ఆరోజు నువ్విచ్చిన సలహా ప్రకారం నేను వేసెక్టమీ ఆపరేషన్ చేయించుకోకుండా ఉండడం మంచిదైంది. లేకపోతే జీవితాంతం పిల్లలు లేకుండా ఉండేవాళ్లం."

"ఔను. ఎంతటి పీడకలలాంటి దుర్భరమైన జీవితాన్నయినా కాలం మర్చిపోయేటట్లు చేస్తుంది. పిల్లలిద్దరూ ఒకేసారి చనిపోయి ఆమె డిప్రెషన్‌లో ఉండిపోయింది. అందుకే అలా ప్రవర్తించింది. కాలం ఆమెలో మార్పు తెచ్చింది. ఇప్పుడిక ఆమె పిల్లలతో ఎంజాయ్ చేయగలదు. చనిపోయిన పిల్లలు గుర్తుకొచ్చినా ఇప్పుడున్న పిల్లల్లో వాళ్లని చూసుకుంటూ తృప్తి పడుతుంది. అది హ్యూమన్ సైకాలజీ. ఆమెకు నవ వసంతం వచ్చింది" అన్నాడు.

o